## క్లుప్తంగా

### పేద కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : నిరుపేద బాధిత కుటుంబానికి రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించింది. మండలంలోని గనిబోయిన గుంపు ప్రాంతానికి చెందిన మట్టా వెంకటేశ్వర్లు కుమారుడు ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రేగా విష్ణు ట్రస్ట్ చైర్మన్ రేగా కాంతారావు శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.50వేల చెక్కును అందించారు. జెడ్పీటీసీ పోశం నరసింహారావు, పినపాక ఎంపీపీ గుమ్మడి గాంధీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ముత్యంబాబు, నాయకులు కోలేటి భవానిశంకర్, నాయకులు సకిని బాబురావు, సతీష్‌రెడ్డి, నాగెల్లి వెంకట్, కోడి అమరేందర్ పాల్గొన్నారు.

### సీఎంతో భేటీలో కనుబుద్ది దేవా



సీఎం రేవంత్‌రెడ్డితో కనుబుద్ది దేవా

దుమ్ముగూడెం: మండలంలోని కే.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా కమిటీ జిల్లా చైర్మన్ కనుబుద్ది దేవాను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో శుక్రవారం టీపీసీసీ ఆధ్వర్యాన 'లంచ్ విత్ రేవంత్‌రెడ్డి' కార్యక్రమాన్ని నిర్వహించగా దేవా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఆయనను సీఎంతో పాటు సోషల్ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ మన్నె సతీష్, నాయకులు పెట్టం నవీన్, సామే రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

### సర్వసభ్య సమావేశం వాయిదా

ములకలపల్లి: మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ భారతి ప్రకటించారు. ఎంపీపీ మట్ల నాగమణి అధ్యక్షతన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీటీలు గైర్హాజరు కావడంతో కోరం లేక సమావేశం వాయిదాపడింది

### స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలుస్తాం..

చండ్రుగొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు బరిలో ఉంటారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్రం స్వామి వెల్లడించారు. మండలంలోని అయన్నపాలెం గ్రామంలో ఆ పార్టీ ముఖ్యనాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, చాపలమడుగు వెంకటేశ్వర్లు, బేతి సోమయ్య, జంగా శ్రీనివాసరెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

### రైతుల ఆకస్మిక మరణాలపై సమాచారం ఇవ్వండి

చర్ల: ఆకస్మికంగా మరణిస్తున్న రైతులకు సంబంధించి 24 గంటల్లోగా వారి బంధువులు సమాచారం అందించాలని మండల వ్యవసాయశాఖాధికారి శివరాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ షాక్, పాము కాటు, తేలుకాటు, పిడుగుపాటు ఇతరత్రా కారణాలతో మరణించిన రైతులకు సంబంధించి సమాచారాన్ని ఏఈఓలకు 24 గంటల్లోగా తెలియజేయాలని వారి వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లయితే వారికి రైతు బీమా వర్తిస్తుందని తెలిపారు.

### దాడి ఘటనలో కేసు

సఅశ్వారావుపేట: దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాండ్లగూడెంకు చెందిన ఉప్పుశెట్టి వెంకటలక్ష్మి భర్త రెండేళ్ల క్రితం మృతిచెందగా మామయ్య అయిన వాంకుడోత్ లాల్యా ఇంట్లో ఉంటోంది. ఈనెల 15న రాత్రి 10 గంటల సమయాన అదే గ్రామానికి చెందిన వాంకుడోత్ రాము ఆమెతో గొడవకు దిగాడు. దీంతో లాల్యా ఇంటి నుంచి బయటకు వచ్చి నిలదీస్తుండగా రాము అన్న శ్రీను కూడా వచ్చి మామాకోడళ్లపై దాడి చేశారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు రాము, శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఉచిత వైద్యశిబిరం

మణుగూరు టౌన్: సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని చినరావిగూడెం గిరిజన గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి వైద్యులు రమణయ్య 115 మందికి వివిధ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సౌందర్యవతి, ఆస్పత్రి సిబ్బంది శ్రీకాంత్, పవన్, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

# మూగరోదన వినేదెవరు..?

## పశువైద్యశాలల్లో కనపడని రెగ్యులర్ వైద్యులు

- మూడు వైద్య కేంద్రాలకూ ఒక్క ఇన్‌చార్జి వైద్యురాలు!
- మూగజీవాలకు అందని వైద్యసేవలు
- వైద్యులు, మందుల కొరతతో తీవ్ర అవస్థలు





దమ్మపేటలోని ప్రాథమిక పశువైద్య ఆరోగ్య కేంద్రం

దమ్మపేట: ప్రభుత్వ పశు వైద్యుల కొరత కారణంగా మండల పరిధిలోని మూగజీవాలకు, వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. మండలంలో వేలాది సంఖ్యలో పశువులున్న, వాటికి తగ్గట్టుగా పశు వైద్యులు మాత్రం నియమించబడలేదు. మండలంలోని మూడు ప్రభుత్వ ప్రాథమిక పశువైద్య కేంద్రాలకు, ముగ్గురు పశు వైద్యులు ఉండాల్సి ఉండగా, కనీసం ఒక్కరు కూడా రెగ్యులర్ పశువైద్యులు లేరు. కేవలం ఒకే ఒక్క ఇన్‌చార్జ్ వైద్యుడు ఈ మూడు పశు వైద్య ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి రావడంతో, వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందట్లేదు. మండలంలో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఉన్నప్పటికీ, వైద్యులు, మందులు అందుబాటులో లేక కేవలం వెటర్నరీ అసిస్టెంట్ల మీద మాత్రమే ఆధారపడి వైద్య సేవలు నామమాత్రంగా అందుతున్నాయి.

**వైద్యం అందక మృత్యువాత..**

మండలంలో 8,167 ఆవులు, 17,302 గేదెలు, 7,544 గొర్రెలు, 17,068 మేకలు తదితర జీవాలున్నాయి. కొద్ది నెలల కిందట ఆవులకు లంపీ స్కిన్ వంటి తీవ్రతరమైన వ్యాధులు సోకగా, వైద్యులు, మందుల కొరతతో అవి చనిపోయాయని పాడి రైతులు చెబుతున్నారు. అదేవిధంగా ఇటీవల సోకిన అంటు వ్యాధుల కారణంగా అనేక పశువులు మృత్యువాత పడ్డాయి. వైద్యులు, సరైన మందులు అందుబాటులో లేని కారణంగా కొన్ని సందర్భాల్లో నాటు వైద్యం ద్వారా పశువుల పెంపకందారులు స్వయంగా పశువులకు చికిత్స చేస్తున్నారు. తీవ్రమైన వ్యాధులు ప్రబలిన సందర్భాల్లో పశువైద్య కేంద్రాలను ఆశ్రయించినప్పటికీ, వైద్యులు అందుబాటులో లేకపోగా, కనీసం వాటికి తగిన మందులు కూడా లేక పశు యజమానులనే బయట తెచ్చుకొమని సూచించడం విస్మయానికి గురిచేస్తోంది. పశువులకు చిన్న వ్యాధులు వచ్చిన సమయాల్లో వైద్యశాలకు తీసుకెళ్తే, మందులు అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు. వైద్యానికి కావాల్సిన మందులు చీటీలపై రాసి ఇవ్వడంతో, వాటి కొనుగోలు చేయడానికి వందలు, వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూడు చోట్ల అంతే..**

మండలంలోని దమ్మపేట, పట్వారిగూడెం, నాగుపల్లి గ్రామాల్లో మూడు ప్రభుత్వ ప్రాథమిక పశు వైద్య కేంద్రాల్లో ఎక్కడా రెగ్యులర్ వైద్యులు అందుబాటులో లేరు. అశ్వారావుపేట మండలం వినాయకపురం పశువైద్య కేంద్రం డాక్టర్ స్వప్న దమ్మపేటలోని మూడు పశు వైద్యశాలలకు కలిపి ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. ఇవికాక మండల పరిధిలో పట్వారిగూడెం, అంకంపాలెం, జగ్గారం, గండుగులపల్లి, నాచారం, మొద్దులగూడెం, గట్టుగూడెం, రంగువారిగూడెం, మందలపల్లి, ముష్టిబండ, మల్కారం, లింగాలపల్లి, గ్రామాల్లో 11 ఉప వైద్య కేంద్రాలు అందుబాటులో ఉండగా, వీటిలో కిందిస్థాయి సిబ్బందితో వైద్యసేవలు అందుతున్నాయి. వ్యాధి తీవ్రత అధికమైన సందర్భాల్లో సైతం వైద్యులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

**మందులు ఇవ్వడం లేదు..**



గొర్రెలు, మేకలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు ప్రభుత్వ పశు వైద్యశాలలో ఇవ్వడం లేదు. ఓసారి ఆవుకు లంపీ స్కిన్ వ్యాధి సోకగా మందులు బయట కొని చికిత్స చేయించినా మృత్యువాత పడింది. ఆస్పత్రిలో మందులు లేవన్నా, ఇంటికి వస్తే మాత్రం మందులు ఇచ్చి డబ్బు వసూలు చేస్తున్నారు.

– తెల్లమేకల సత్యనారాయణ, గొర్రెల పెంపకందారుడు, దమ్మపేట

**రెగ్యులర్ వైద్యులను నియమించాలి**



మండలంలో రెగ్యులర్ వైద్యులు లేక అత్యవసర సమయాల్లో పశువులకు వైద్యం అందడం లేదు. ఆస్పత్రిలో మందులు కూడ లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన వైద్యులను నియమించాలని కోరుతున్నాం.

– చిన్నశెట్టి గోపి, పాడిరైతు

**వైద్య సేవలు అందిస్తూనే ఉన్నాం**



జీవాలకు సక్రమంగానే వైద్యం అందిస్తున్నాం. నేను అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం, నారాయణపురంతో పాటు అదే మండలంలోని మూడు జీపీలకు స్పెషల్ ఆఫీసర్‌గా, దమ్మపేట మండలంలోని మూడు పశువైద్యశాలలకు ఇన్‌చార్జి పనిచేస్తుండడంతో ఒత్తిడి ఉంటోంది. మందుల కొరత విషయం నా దృష్టికి రాలేదు.

– డాక్టర్ స్వప్న, ఇన్‌చార్జి పశు వైద్యురాలు

## స్థానిక ఎన్నికల్లో ప్రాతినిధ్యం పెరగాలి



దేవయ్యను సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు

అశ్వాపురం: స్థానిక ఎన్నికల్లో వార్డు మెంబర్ స్థాయి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేటర్లుగా మున్నూరుకాపు అభ్యర్థుల ప్రాతినిధ్యం పెరగాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు నివాసంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ... సంఘం గ్రామ, మండల స్థాయి కమిటీలు పూర్తి చేసి అందరూ ఐక్యంగా ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. మున్నూరుకాపులను ఐక్యం చేసేందుకు మండలాల వారీగా చైతన్య యాత్రలు, కార్పొరేషన్ విధివిధానాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం కొండా దేవయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఊసా అనిల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

### డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ బదిలీ

అశ్వాపురం: అశ్వాపురం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ బాలరాజు మణుగూరు బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. టేకులపల్లి బ్రాంచ్ మేనేజర్ వెంకటకృష్ణ అశ్వాపురానికి బదిలీ కాగా శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బాలరాజును సిబ్బంది ఘనంగా సన్మానించారు.

### ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన పాయం దుర్గారావుకు అతని స్నేహితులు రూ.15 వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. దుర్గారావు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో కంటికి గాయం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం తనతో పాటు కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదివిన 2008 బ్యాచ్ స్నేహితులు దుర్గారావుకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కారం వెంకట్రావు, మల్లేష్, పాయం సురేష్, మర్మం నగేష్, కణిత చంటిబాబు, వర్సా వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

### ఘనంగా సీతానవమి



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

ములకలపల్లి: మండలకేంద్రంలోని భక్త అభయాంజనేయస్వామి ఆలయంలో సీతానవమి ఉత్సవాలను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, సామూహిక సీమంతాలు నిర్వహించారు. అర్చకులు ముకుందల సత్యనారాయణ శాస్త్రి, దమాదేవి, ఎంపీటీసీ శగనపాటి మెహరమణి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు పుల్లూరు జయశ్రీ, జిల్లా సామాజిక సామరస్యత ప్రముఖ్ గొడ్ల రాజు, వీహెచ్‌పీ మండలాధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు బిక్కుమళ్ల సుధాకర్, శేషగిరిరావు, అవినాశ్ పాల్గొన్నారు.

### గురుకుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా అనూష

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కళాశాల అధ్యాపకురాలు అనూష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపాల్ స్వప్నకుమారిని సస్పెండ్ చేయగా అధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టారు.

## పూసుగుప్పలో రక్తనమూనాల సేకరణ



రక్తనమూనాల సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చర్ల రూరల్ : ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు చర్ల మండలంలోని పూసుగుప్ప గ్రామంలో శుక్రవారం కొయ్యూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 264 మందికి ముందస్తుగా మలేరియా రక్తనమూనాలను సేకరించారు. వీరందరికీ నెగిటివ్ వచ్చిందని వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను తొలగించారు. అలాగే జ్వరాలు సోకినట్లయితే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ వేణుగోపాల్, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, యంటీయస్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంటు ధర్మారావు, నరసింహారావు, ఏఎన్‌యంలు సమ్మక్క, అనసూర్య, యంఎల్‌హెచ్‌పీ గీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేట: మండల పరిధిలోని నారంవారిగూడెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఏ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భద్రాచలంఅర్బన్: పట్టణంలో గల 11 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు ఐటీడీఏ రోడ్డు, ఆదర్శనగర్, రాజీవ్‌నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ములకలపల్లి: మండలంలోని సబ్ స్టేషన్లు, 33 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ లక్ష్మనరసింహారావు ప్రకటనలో తెలిపారు.

చండ్రుగొండ: మండలంలోని పోకలగూడెంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఎంఎల్.నర్సింహారావు తెలిపారు. పోకలగూడెం, గానుగపాడు, రేపల్లెవాడ, తుంగారం, సుంకరబంజర, అన్నారంతండా, మంగయ్య బంజర్, వెంకట్యాతండా, వంకనెంబర్, సామ్య తండా, కరిశెలబోడు తండాలకు ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం 11కేవీ ఫీడర్‌లో లైన్ మరమ్మతుల కారణంగా ఎర్రగుంట, గుంపెన, జానకిపురం, రంగాపురం, మైబునగర్, బూర్గుడెం గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ తరుణ్ తెలిపారు.

కరకగూడెం: పినపాక, కరకగూడెంలలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయా మండలాల విద్యుత్ ఏఈలు కావ్య, నరేందర్ రెడ్డి వేర్వేరు ప్రకటనలో తెలిపారు. పినపాకలోని బయ్యారం సబ్ స్టేషన్లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే కరకగూడెం మండల వ్యాప్తంగా 33కేవీ లైన్ మరమ్మతులు దృష్ట్యా ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు.

### 24న వైస్ ఎంపీపీ ఎన్నిక

అశ్వాపురం: మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడి ఎన్నికను ఈ నెల 24న నిర్వహించనున్నట్టు అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రంపై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో వీరభద్రం పదవి కోల్పోయారు.

## ప్రశ్నించడం బీఆర్ఎస్‌తోనే సాధ్యం..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపించాలి
- ఎంపీ రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు



భద్రాచలంలో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర

మణుగూరు రూరల్: రాష్ట్రంలో హామీల అమలును ప్రశ్నించడం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. మండలంలోని సాయినగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని శక్రవారం నిర్వహించగా ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ.. అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజలతో పాటు యువత భవిష్యత్ కోసం బీఆర్ఎస్ పార్టీని ఆదరించి 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తొలుత ఎంపీ రవిచంద్రకు బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సమావేశాల్లో జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పినపాక ఎంపీపీ గుమ్మడి గాంధీ, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, కోలేటి భవానీశంకర్, పి.సతీష్‌రెడ్డి, రావుల సోమయ్య, కోడి అమరేందర్, పానుగోటి భద్రయ్య, వట్టం రాంబాబు, యాదగిరిగౌడ్, సకిని బాబురావు, నాగెల్లి వెంకట్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి**

భద్రాచలంఅర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. భద్రాచలంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికను సవాల్‌గా తీసుకుని ప్రతీ గ్రాడ్యుయేట్ రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అభ్యర్థి రాకేష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..



భద్రాచలం: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, భక్తులు



చండ్రుగొండ : త్రిమూర్తుల ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలం గోల్డ్‌స్మిత్ కాలనీలోని గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ తెలిపారు. స్వామి 331వ ఆరాధన మహోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించగా అన్నదానాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అనుగోజు నాగభూషణం, ముగడ హరినాథ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అనుగోజు నర్సింహాచారి, పెద్దోట సత్యనారాయణతో పాటు ఆలేటి వెంకటనాగేశ్వరరావుచారి, త్రివిక్రమ్, దార్ల బ్రహ్మానందం, ఆరటికట్ల రాము, కేతినేని లలిత, బి.వెంకటరెడ్డి, మాధవరెడ్డి, అప్పారి రాము, బొడ్డోజు శ్రీను కె.రాము తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ : మండలకేంద్రంలోని త్రిమూర్తుల ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజారి కృష్ణమాచారి రామలింగేశ్వరచారి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అభిషేకాల అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు సోము కృష్ణమాచారి, వారాధి సత్యనారాయణ, వారాధి రామాచారి, వెంకటాచారి, రవిందర్‌రెడ్డి, నున్న వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## కార్మికులపై కక్ష సాధింపు చర్యలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో హిందుస్థాన్ ట్రేడ్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులను 12 గంటలు పనిచేయిస్తూ 8 గంటల వేతనం కూడా చెల్లించడం లేదని, అడిగితే కోతలు విధిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మీనారాయణ, బ్రాంచి ఉపాధ్యక్షుడు రామనర్సయ్య అన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరతూ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలోనూ ఇదే సమస్యపై ఇచ్చిన వినతిపత్రం గుర్తు చేసి సమస్య పరిష్కరించి వేధింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఏరియా జీఎం వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటేశ్వర్లు, తోట రమేశ్, ఆదెర్ల సురేందర్, నాయకులు అవినాష్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాల్యమిత్రుడిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని బాలరాజుగూడెం గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కల్లూరి వెంకటేశ్వర్లు హైదారాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే ఆయన్ని ఆస్పత్రిలో పరామర్శించారు.

### బెల్ట్‌షాపుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

మణుగూరు రూరల్ : మండల వ్యాప్తంగా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపుల నిర్మూలనకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అక్షర మహిళా మండలి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... మండలంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారని, ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం సిండికేట్‌కు సహకరిస్తూ వారి వ్యాపారాన్ని చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. బెల్ట్ షాపులను ఎక్సైజ్‌శాఖ అధికారులు తక్షణమే నిరోధించాలని, లేనిపక్షంలో కమిటీ ఆధ్వర్యంలో బెల్ట్ పాపుల నిర్మూలనకు ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

## పనిచేయని చేతిపంపులు..

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న గిరిజనులు



అలంకారప్రాయంగా ఉన్న చేతిపంపులు

అశ్వాపురం: మండలపరిధిలోని మారుమూల గ్రామమైన వెంకటాపురం పంచాయతీలోని మామిళ్లవాయి గిరిజన గ్రామంలో ఉన్న రెండు చేతిపంపులు పని చేయకపోవడంతో గిరిజనులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 80 కుటుంబాలకు తాగునీటి కోసం ఈ రెండు చేతిపంపులే ఆధారం. తాగునీటికి ఆధారమైన చేతిపంపులు మరమ్మతులకు గురికావడంతో ఇబ్బంది పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో మిషన్‌భగీరథ బోరు ద్వారా వాటర్ ట్యాంక్‌కు ఎక్కించి ఇంటింటికి అందిస్తున్న నీరు తాగలేకపోతున్నామని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో మిషన్ భగీరథ నీరు, పగలు గ్రామంలోని బోరుతో వాటర్‌ట్యాంక్‌కు నీరు ఎక్కిస్తుండటంతో ట్యాంక్ శుభ్రంగా ఉండటం లేదని, గ్రామంలోని బోరుతో ట్యాంక్‌కు ఎక్కిస్తున్న నీరు అధ్వానంగా ఉంటోందని అందుకే చేతిపంపుల నీరే తాగుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చేతిపంపులు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య తీర్చాలని, మరమ్మతులయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు. వాటర్ ట్యాంక్ శుభ్రం చేసి స్వచ్ఛమైన మిషన్‌భగీరథ నీరు ఇంటింటికి అందేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.